
సాక్షి ఒడిశా

సోమవారం । 2। అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.7,40,187
బంగారం	5 గ్రాముల 750 మిల్లీ గ్రాములు
వెండి	18 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



వృద్ధులు సమాజానికి విలువైన ఆస్తులు

వయో వృద్ధులు సమాజానికి విలువైన ఆస్తులని సీఎం నవీన్ పట్నాయక్ ఆదివారం అభివర్ణించారు.

- 8లో



స్వచ్ఛతే మహాత్ముడికి నివాళి

దేశం పరిశుభ్రంగా ఉంచుకోవడమే జాతిపిత మహాత్మాగాంధీకి నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

నకిలీ కాస్మొటిక్ సామగ్రి సీజ్



పెద్ద బజార్‌లో నకిలీ కాస్మొటిక్ దుకాణంపై దాడులు చేస్తున్న పోలీసులు



పోలీసులు సీజ్ చేసిన సామగ్రి

బరంపురం: నగరంలోని వివిధ మార్కెట్లలో దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి సుమారు రూ.10 లక్షలు విలువ చేసే నకిలీ కాస్మొటిక్ సామగ్రి సీజ్ చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. హిందుస్థాన్ లీవర్ కంపెనీ పేరుతో నకిలీ కాస్మొటిక్ సామగ్రి నగరంలో అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నట్లు కంపెనీ నుంచి ఫిర్యాదు వచ్చింది. దీంతో శనివారం రాత్రి పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి పత్రావీధి, గౌడా వీధి మరియు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని దుకాణాలపై దాడులు చేపట్టారు. సుమారు రూ.10 లక్షలు విలువ చేసే సామగ్రి సీజ్‌చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



కలపతో పట్టుబడిన నిందితులు, (ఇన్‌సెట్లో) పికప్ వ్యాన్‌లో ఉన్న కలప

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు ఆదివారం ఉదయం ఖోయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ గ్రామం వద్ద ఒక పికప్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బలిమెల–జైపూర్ ప్రధాన రహదారిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక పికప్ వ్యాన్‌లో తనిఖీలు నిర్వహించగా కలప తరలిస్తుండడం బయటపడింది. వ్యాన్‌లో ఉన్నవారిని అటవీ శాఖ అనుమతి పత్రాలు అడిగితే తడబడ్డారు. దీంతో కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి బలిమెల పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరిని విచారించగా ఈ ఇద్దరూ కలపను చిత్రకొండ మీదుగా సీలేరు తరలించనున్నట్లు తెలియజేశారు. అరెస్టైనవారు సీలేరుకు చెందిన కోర భాస్కర్‌రావు(42), గొల్లి మహదేవ్(35)గా నిర్ధారించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయిక్ తెలిపారు. పట్టుబడిన కలప విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

88 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలోని గొడిగూడ గ్రామ రహదారిలో మల్కన్‌గిరి ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో చిత్రకొండ నుంచి మల్కన్‌గిరికి అతివేగంగా ఒక కారు వెళ్తుండడం గమనించి ఆపారు. అనంతరం కారులో తనిఖీలు నిర్వహించగా, కారు సీటు లోపల గంజాయి ప్యాకెట్లు ఉండడం గమనించి వెంటనే డ్రైవర్‌ను అరెస్టు చేయడంతో పాటు కారును సీజ్ చేశారు. ఈ గంజాయిని మల్కన్‌గిరి మీదుగా ఛత్తీస్‌ఘడ్ తరలించనున్నట్లు తెలుస్తోంది. అరెస్టైన వ్యక్తి చిత్రకొండ ప్రాంతానికి చెందిన సంజాయ్ విశ్వాస్(22)గా పోలీసులు వెల్లడించారు. పట్టుబడిన 88 కిలోల గంజాయి విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు ఆదివారం కోర్టు సెలవు కావడంతో నిందితుడిని కోర్టులో సోమవారం హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

సైబర్ క్రైమ్స్‌పై... సమర శంఖారావం

- ప్రచార రథాలు ప్రారంభించిన సీఎం నవీన్



సైబర్ భద్రతా ప్రచార రథాలను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: స్థానిక కళింగ స్టేడియంలో రాష్ట్రస్థాయి సైబర్ భద్రతా ప్రచారాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 34 సైబర్ భద్రతా ప్రచార రథాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసేందుకు బయల్దేరాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలు మరియు పంచాయతీ ప్రాంతాల్లో సైబర్ భద్రత అవగాహన సందేశాలను ఈ రథాలు ప్రచారం చేస్తాయి. గత కొన్నేళ్లుగా సైబర్ క్రైమ్ మొత్తం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితి నివారించడానికి అవగాహన మరియు జాగ్రత్త కీలకం. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల్లో ఈ విషయంలో అవగాహన కల్పించేందుకు ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి తుషార్ కాంతి బెహరా, మంత్రి అశోక్ చంద్ర పండా, భువనేశ్వర్‌లోని ఇద్దరు ఎమ్మెల్యేలు అనంత్ నారాయణ్ జెనా, సుశాంత్ రౌత్, నగర మేయర్ సులోచన దాస్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సునీల్ కుమార్ బన్సాల్ మరియు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ రథాలకు స్వాగతం

సైబర్ భద్రతా ప్రచారం కోసం బయల్దేరిన రథాలకు జిల్లా యంత్రాంగం స్వాగతం పలుకుతుంది. ప్రతిరోజూ కనీసం రెండు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీంతో పాటు మండలం, పోలీసుస్టేషన్ పరిధిలోని పలు జనసందోహ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల మధ్య క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. ఈనెల 8న ఉదయం వివిధ నగరాల్లో మినీ మారథాన్ నిర్వహణ కార్యక్రమం ఖరారైంది. 14వ తేదీన ఈవినింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించి సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన కల్పించనున్నారు. 15వ తేదీన ముగింపు మహోత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి జిల్లా పరిపాలన అధికారులతో పాటు పద్మ అవార్డు గ్రహీతలు, స్వాతంత్ర్య సమరయోధులు హాజరుకానున్నారు. ప్రచారంలో పంచాయతీ ప్రతినిధులు, మిషన్ శక్తి సభ్యులు, పాఠశాల మరియు సామూహిక విద్యా శాఖ, ఉన్నత విద్యా శాఖ, పంచాయితీ రాజ్ మరియు సమాచార - పౌరసంబంధాల శాఖ అధికారులతో అనుబంధ సిబ్బంది పాలుపంచుకుంటారు.

గిరిజన భాషకు ప్రోత్సాహం



నిఘంటువు ఆవిష్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ తదితరులు

- సంతాలి–ఒడియా–ఆంగ్లం నిఘంటువు ఆవిష్కరణ

భువనేశ్వర్: గిరిజన సంస్కృతిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాలీ భాషపై నిఘంటువును ఆదివారం విడుదల చేశారు. ఆయన ఉంటున్న నవీన్ నివాస్‌లో జనజాతి భాషా సాంస్కృతిక ప్రతిష్టాన్ ప్రచురించిన సంతాలి - ఒడియా - ఆంగ్ల నిఘంటువును ఆవిష్కరించారు. ఇతర భాషావేత్తల సాయంతో సంతాలి భాషపై ప్రముఖ నిపుణుడు చైతన్య ప్రసాద్ మాఝీ ఈ నిఘంటువును రూపొందించారు. ఈ సందర్భంగా ప్రాథమిక తరగతులకు సంబంధించి సవర, కోయ, గోండి, ముండా 4 గిరిజన భాషల్లో రాసిన 21 పాఠ్య పుస్తకాలను సైతం నవీన్ పట్నాయక్ విడుదల చేశారు. కార్యక్రమానికి హాజరైన గిరిజన సంఘాల ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ సంతాలి భాషపై అవగాహన కల్పించేందుకు నిఘంటువు ఎంతో దోహదపడుతుందన్నారు. గిరిజన భాషల్లోని పుస్తకాలు విద్యార్థులను పాఠశాల విద్యవైపు ఆకర్షిస్తాయని తెలిపారు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో సంతాలీ భాష స్థానం చేజిక్కించుకుందన్నారు. మరో 11 గిరిజన భాషల్లో ప్రాథమిక పాఠ్య పుస్తకాలను ప్రచురించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి, మైనారిటీలు మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ్ సరకా, ఆ శాఖ కార్యదర్శి రూపా రోషన్ సాహు, డైరెక్టర్ ఇంద్రమణి త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా గోదాముపై దాడి



బాణాసంచా గోదాంలో దాడులు చేస్తున్న పోలీసులు

బరంపురం: స్థానిక లంజిపల్లి, బాబాజీ దాబా వెనుకనున్న ఒక గోదాములో లైసెన్స్ లేకుండా బాణాసంచా నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు. దీంతో పోలీసులు గోదాముపై దాడిచేశారు. సుమారు రూ.4 లక్షలు విలువ చేసే బాణాసంచా సీజ్ చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు బీఎన్‌పూర్ పోలీసులు తెలియజేశారు.



లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన బాణాసంచా

స్క్రబ్ టైఫస్‌తో మరొకరు మృతి

- బర్‌గడ్ జిల్లాలో 7కి చేరిన మృతులు

భువనేశ్వర్: రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా పశ్చిమ ఒడిశా ప్రాంతంలో స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి వ్యాప్తి అత్యంత ప్రమాదకరంగా పంజా విసురుతోంది. ఈ రోగం బర్‌గడ్ జిల్లాలో మరొకరి ప్రాణాలను బలిగొంది. దీంతో ఈ జిల్లాలో స్క్రబ్ టైఫస్ మృతుల సంఖ్య 7కి చేరిందని అధికారులు ఆదివారం తెలిపారు. జిల్లాలోని సోహేలా ప్రాంతానికి చెందిన 48 ఏళ్ల రోగి ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్క్రబ్ టైఫస్‌తో మరణించినట్లు బర్‌గడ్ జిల్లా ప్రజారోగ్య అధికారి (డీపీహెచ్‌ఓ) సాధు చరణ్ దాస్ తెలిపారు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర బృందం ప్రభావిత జిల్లాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించి, వ్యాధి వ్యాప్తికి కళ్లెం వేసేందుకు అవసరమైన చర్యలను సూచిస్తోందని అనుబంధ వర్గాలు తెలిపాయి. 6 మంది సభ్యుల బృందం శనివారం స్క్రబ్ టైఫస్ బారినపడిన సుందర్‌గఢ్ జిల్లాను సందర్శించి పరిస్థితిని సమీక్షించింది. నిపుణుల బృందం ఆదివారం బర్‌గడ్ జిల్లాలో పరిస్థితిని సమీక్షించింది. పరిస్థితిని క్షుణ్ణంగా అంచనా వేయడానికి కేంద్ర బృందం పశ్చిమ ఒడిశాలోని వివిధ జిల్లాలను సందర్శించనుంది. బృందం సభ్యులు బర్‌గడ్ జిల్లా ఆరోగ్య అధికారులతో సమస్య స్థితిగతులను చర్చించారు. వారు జిల్లాలోని వివిధ ప్రాంతాలను సందర్శించనున్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి (డీహెచ్‌హెచ్) ప్రయోగశాలను కూడా తనిఖీ చేస్తారు. బర్‌గడ్‌లో 1,775 రక్త నమూనాలను పరీక్షించగా, 89 స్క్రబ్ టైఫస్ కేసులు ఇప్పటివరకు కనుగొనబడ్డాయి. సుందర్‌గడ్ జిల్లాలో శనివారం నాటికి ఈ రోగుల సంఖ్య 292 గా నిలిచింది.

చాతుర్మాస వ్రతం ముగింపు



జగద్గురు శంకరాచార్యులు స్వామి నిశ్చలానంద సరస్వతిని ఆహ్వానిస్తున్న సీఏవో రంజన్ కుమార్ దాస్

- పతితపావన స్వామిని దర్శించుకున్న శంకరాచార్యులు

భువనేశ్వర్: పూరీ గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి సీమాంతర యాత్ర సంప్రదాయబద్ధంగా జరిగింది. చాతుర్మాస వ్రతం ముగింపు పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. జగద్గురు శంకరాచార్యులు ఈ సందర్భంగా గోవర్ధన్ మఠం నుంచి బయటకు వచ్చి శ్రీ మందిరం సింహ ద్వారం ప్రాంగణంలో కొలువైన పతిత పావన స్వామిని తొలుత దర్శనం చేసుకున్నారు. తరువాత బట్టో మంగళ, నీలాంబర్‌పూర్ బిల్లొ మహాదేవుని దర్శించుకున్నారు. సాయంత్రం సాగర తీరాన సంధ్యా హారతి ముగించి తిరిగి గోవర్ధన మఠానికి చేరారు. జగద్గురు శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి చాతుర్మాస్య వ్రతం సందర్భంగా శ్రీ క్షేత్రం పొలిమేర దాటారు. ఈ వ్రతం పురస్కరించుకుని నాలుగు నెలలూ గోవర్ధన్ ఆశ్రమంలో ఉంటూ స్వామి శిష్యులు, భక్తులకు ధార్మిక విజ్ఞాన బోధ చేశారు. నాలుగు నెలలుగా నిర్వహించే చాతుర్మాస్య వ్రతాన్ని నియమ, సంప్రదాయాల ప్రకారం పూర్తి చేసుకున్న జగద్గురు శంకరాచార్యులు తన శిష్యులతో కలిసి ముందుగా ఆలయ సింహద్వారం నుంచి పతిత పావన స్వామిని దర్శించి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ మందిరం ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఏఓ) రంజన్‌కుమార్ దాస్ తదితరులు శంకరాచార్యులకు స్వాగతం పలికి సంప్రదాయబద్ధంగా శ్రీ మందిరం సింహ ద్వారం ప్రాంగణానికి తీసుకుని వెళ్లారు. అనంతరం బట్టో మంగళ ఆలయానికి వెళ్లి పుష్పాంజలి ఘటించారు. సాయంత్రం పూరీ సాగర తీరంలో ప్రార్థనలు చేసి లోక కల్యాణం కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జగద్గురువుల ఆశీస్సులు పొందారు. మఠం సరిహద్దు దాటి సరిహద్దు లంఘన యాత్ర ముగియడంతో జగద్గురు శంకరాచార్యులు ఇక నుంచి శ్రీ క్షేత్రం పొలి మేరలు దాటి బయట ప్రాంతాలు సందర్శిస్తారు.

దసరా ఉత్సవాలకు సన్నాహాలు

భువనేశ్వర్: స్థానిక ఆంధ్ర సంస్కృతి సమితి (ఏసీఏ) దసరా ఉత్సవాలు నిర్వహణకు చురుకుగా సన్నాహాలు చేస్తోంది. సమితి ఆవరణలో ఈ కార్యక్రమాల కోసం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా మహా అష్టమి, మహా నవమి మరియు విజయ దశమి వేడుకలను జరుపుకోవాలని నిర్ణయించింది. మూడు రోజులూ నిత్యం సాయంత్రం 6.30 గంటలకు శ్రీలలితా సహస్రనామం పారాయణం సామూహికంగా నిర్వహిస్తారు. దసరా వేడుకల్లో మనోరంజక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, దాండియా, గార్బా నృత్య ప్రదర్శనలు ఉంటాయని కార్యదర్శి గన్నవరపు లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో సమితి మహిళా సభ్యులు, ఔత్సాహిక పురుష సభ్యులు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో వీరి కోసం సమితి ప్రాంగణంలో ప్రత్యేక శిక్షణా శిబిరం ప్రారంభించనున్నారు. ఈ శిబిరం ఈనెల 2వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం అవుతుంది. నిత్యం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది.

నకిలీ మద్యం ఫ్యాక్టరీపై దాడి

బరంపురం: జిల్లాలోని అస్కా రోడ్‌లో నకిలీ మద్యం తయారీ ఫ్యాక్టరీపై పెద్ద బజార్ పోలీసులు దాడులు చేపట్టిన ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి అస్కా రోడ్‌లో ఎటువంటి లైసెన్స్ లేకుండా కొంతకాలంగా నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. దీంతో ఈ కర్మాగారంపై బజార్ పోలీసు అధికారులు దాడులు చేపట్టి భారీగా నకిలీ మద్యం సామగ్రిలు, బాటిల్స్, యంత్రాలు, నకిలీ లేబుల్స్ సీజ్‌చేసి ఒక నిందితుని అదుపులోకి తీసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం

నేడు ప్రైవేటు బస్సులు బంద్

- లక్ష్మీ పథకానికి నిరసనగా నిర్ణయం
- వేరే కంపెనీకి బాధ్యతలు అప్పగించడంపై విస్మయం



ప్రైవేట్ బస్టాండ్‌లో నిలిచిన బస్సులు



ప్రైవేట్ బస్సు యజమాన సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మహంతి

జయపురం: మల్కన్‌గిరి జిల్లాలో నేటి నుంచి ప్రారంభమవ్వనున్న లక్ష్మీ పథకాన్ని అవిభక్త కొరాపుట్ జిల్లా ప్రైవేట్ బస్సుల యజమానుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ పథకంలో భాగంగా బస్సులను నడిపేందుకు వేరే కంపెనీకి బాధ్యతలు అప్పగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ప్రైవేట్ బస్సు యజమానుల కార్యాలయంలో అవిభక్త కొరాపుట్ జిల్లా బస్సు యజమానుల సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయపురం మున్సిపల్ చైర్మన్, బస్సు యజమానుల సంఘ నేత నరేంద్రకుమార్ మహంతి మాట్లాడుతూ.. లక్ష్మీ పథకాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఆ పథకం అమలు చేసే బాధ్యతను మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన ఒక కంపెనీకి ఇవ్వడంపై వ్యతిరేకిస్తున్నట్లు తెలియజేశారు. బస్సులు రూట్లలో నడపడం దగ్గర నుంచి, ఉద్యోగులను నియమించడం వరకు ఆ కంపెనీయే చూస్తుందని వివరించారు. బస్సుల్లో ఎంత ఆదాయం వస్తుందో అంతా ప్రభుత్వానికి ఇస్తుందని, ప్రభుత్వం ఒప్పందం ప్రకారం బస్సులను సమకూర్చిన కంపెనీలకు డబ్బు చెల్లిస్తుందని వివరించారు. అయితే ఈ పథకంలో బస్సుల నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్ బస్సుల యజమానులకు అప్పగిస్తే అందరూ లబ్ధి పొందగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. లేనిచో ప్రైవేట్ బస్సు యజమానులు కొన్నటువంటి కొత్త బస్సులను ప్రభుత్వం తీసుకొని నడిపినా బాగుంటుందన్నారు.

ప్రభుత్వానికి సహకరిస్తున్నాం

ప్రైవేట్ బస్సుల యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రభుత్వానికి సహకరిస్తోందని మహంతి గుర్తు చేశారు. ఎన్నికల సమయం నుంచి ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రైవేట్ బస్సులను సమకూర్చుతున్నామన్నారు. రోడ్లు బాగోలేకపోయినా గ్రామీణ ప్రాంతాలకు, నక్సల్ ప్రభావిత ప్రాంతాలకు ప్రైవేట్ బస్సులు నడుపుతూ, ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. దీని వలన నష్టాలు వచ్చినా భరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి టాక్స్‌లు కడుతున్నామని, అయినా ప్రభుత్వం ప్రైవేట్ బస్సుల యజమానులను చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ పథకం బాధ్యతలను వేరే కంపెనీకి ఇవ్వడానికి నిరసనగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల వరకు 24 గంటలు బస్సులు నిలిపివేసేందుకు తమ అసోసియేషన్ నిర్ణయించినట్లు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నవరంగపూర్, ఉమ్మరకోట్, మల్కన్‌గిరి, రామగడ, కొరాపుట్, సెమిలిగుడ, జయపురం ప్రైవేట్ బస్సు యజమాన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు



జిల్లా బాస్కెట్‌బాల్ జట్లతో అర్జున్‌రావురెడ్డి, రాజు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా జట్లు ఆటతీరుతో అదరగొడుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు వేదికగా జరుగుతున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2023లో జిల్లా జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. తమ ప్రత్యర్థి జట్లపై జయభేరి మోగించిన జిల్లా పురుషులు, మహిళల రెండు జట్లు క్వార్టర్స్‌కు చేరడంపై జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, కోచ్ జి.అర్జున్ రావురెడ్డి, సీనియర్ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్



గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: మేఘవరం పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో ఆదివారం ఉదయం టెక్కలి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గత కొద్ది రోజులుగా గిరిజన గ్రామాల్లో నాటుసారా తయారు జరుగుతుందనే అనుమానంతో ఎస్పీ రాధిక, టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి ఆదేశాల మేరకు నాలుగు మండలాల ఎస్ఐలతో పాటుగా సుమారు 40 మంది సిబ్బందితో మేఘవరం పంచాయతీ పరిధిలోని భీంపురం, సరియాపల్లి గిరిజన గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సోదాలు చేశారు. అదేవిధంగా గ్రామాల్లో ఉన్న వాహన రికార్డులు పరిశీలించారు. అక్కడి ఇళ్ల వెనుక ఉన్న పెరటల్లోను, గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో సైతం నాటుసారా తయారు చేస్తున్నారనే అనుమానంతో తనిఖీలు నిర్వహించారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి నాటుసారా తయారు ఆనవాలు సైతం కనిపించలేదని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సీనియర్ క్రికెట్ ప్లేయర్ మృతి



కాకర్ల శ్రీను (ఫైల్)

టెక్కలి రూరల్: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన సీనియర్ క్రికెట్ ప్లేయర్ కాకర్ల శ్రీను ఆదివారం మృతి చెందారు. శ్రీను స్థానికంగా ఎందరో యువకులను క్రికెటర్లుగా తీర్చిదిద్దారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లో శంషాబాద్ సమీపంలో రోడ్డు పక్కగా నడుచుకుని వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో అక్కడే ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్నారు. శ్రీను మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.

జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ నార్త్‌జోన్ అండర్–23 త్రీడేస్ మ్యాచ్‌ల క్రికెట్ టోర్నీకి జిల్లా జట్టు ఖరారైంది. మద్దెల సూర్యకిరణ్ సారథ్యంలో 16 మందితో సభ్యులతో కూడిన తుది జట్టుతోపాటు మరో ఐదుగురు ఆటగాళ్లను స్టాండ్‌బైగా ఎంపికచేశారు. ఎంపికైన జిల్లా జట్టు జాబితాను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎస్ శాస్త్రి, హసన్‌రాజ షేక్ వెల్లడించారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని హిందూస్థాన్ జింక్ గ్రౌండ్ గాజువాక వేదికగా ఈనెల 3వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. సోమవారం సాయంత్రం జిల్లా జట్టు ఇక్కడ నుంచి పయనమై విశాఖలోని క్రీడామైదానం వద్ద రిపోర్ట్ చేయనుంది.

శ్రీకాకుళం మ్యాచ్‌ల షెడ్యూల్ ఇది..

ఈనెల 13వ తేదీ వరకు జరగనున్న ఈ టోర్నీలో భాగంగా శ్రీకాకుళం జట్టు తన మొదటి మ్యాచ్ (3,4,5 తేదీల్లో) విజయనగరంతో పోటీపడనుంది. తన రెండో మ్యాచ్(7,8,9 తేదీల్లో) తూర్పుగోదావరి జట్టుతో, ఆఖరి, మూడో మ్యాచ్ (11,12,13 తేదీల్లో) విశాఖపట్నంతో తలపడనుంది. జిల్లా జట్టుకు జీపీ నాయుడు మేనేజర్‌గా, ఎంఎస్ దీపక్‌కుమార్ సెలెక్టర్‌గా వ్యవహరించనున్నారు. జిల్లా జట్టుకు అవసరమైన క్రీడాదుస్తులు, కిట్‌లను మాజీ క్రికెటర్ ఇలియాస్ మహ్మద్ సమకూర్చుతున్నారు.

జిల్లా జట్టు వివరాలు

మద్దెల సూర్యకిరణ్ (కెప్టెన్), ఎస్.హిమకర్, డి.కులశేఖర్, ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్ (వికెట్ కీపర్), ఎస్.సుశాంత్, పి.సిద్ధువిఘ్నేష్, హర్షిత్ కార్తికేయ, వై.జ్ఞానతేజ, థోమస్ (వికెట్ కీపర్), ఎం.పూర్ణచంద్ర, ఎం.రోహిత్, వి.ప్రద్నేష్ సాయి, పి.సతీష్, కె.గణేష్, ఎం.సాయియశ్వంత్, అప్పన్న రెడ్డి. స్టాండ్‌బైగా జి.లవన్, టి.విజయ్, డీవీఎస్ శ్రీరాం, జి.లిఖిత్, బి.జగదీష్ ఎంపికైనవారిలో ఉన్నారు.



జయపురం: కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



జయపురం: పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళా కౌన్సిలర్లు



జయపురం: స్వచ్ఛ భారత్ అభిజాన్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ కేడర్



రాయగడ: ప్రేమ్ పహాడ్ పర్యాటక ప్రాంతాన్ని శుభ్రపరుస్తున్న బీజేపీ మహిళ మోర్చా సభ్యులు

స్వచ్ఛతే మహాత్ముడికి నివాళి

దేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడమే జాతిపిత మహాత్మాగాంధీకి ఇచ్చే నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలోని పలుచోట్ల స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. స్వచ్ఛత మన నినాదం కావాలని, స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. పారిశుద్ధ్య పరిరక్షణే ఆరోగ్యానికి ప్రథమ సోపానమని తెలియజేశారు. స్వచ్ఛ భారత్ కేవలం ఒక్కరోజుకే పరిమితం చేయకుండా నిత్య జీవితంలో అలవాటుగా మారాలని ఆకాంక్షించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే దేశం పరిశుభ్రమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ప్రజలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: అవగాహన ర్యాలీలో పారిశుద్ధ్య సిబ్బంది



జయపురం: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు, నాయకులు



జయపురం: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి



జయపురం: స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న సేవా బృందం



రాయగడ: స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న సాయిప్రియ వాకర్స్ క్లబ్ సభ్యులు



పర్లాకిమిడి: రాజవీధిలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వృద్ధులు సమాజానికి విలువైన ఆస్తులు

- సీఎం నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: వర్చువల్‌గా మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: వయో వృద్ధులు సమాజానికి విలువైన ఆస్తులని సీఎం నవీన్ పట్నాయక్ ఆదివారం అభివర్ణించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి తన సందేశంలో వృద్ధులు తమ జ్ఞానం మరియు అనుభవంతో సమాజాన్ని సుసంపన్నం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులు సమాజానికి చేసిన సేవలను గుర్తిద్దాం మరియు మరింత సమగ్ర ప్రపంచం కోసం వారి ప్రేమ, ఆప్యాయత, సంరక్షణ మరియు సానుభూతిని పొందేలా చూసేందుకు నిబద్ధతను పునరుద్ఘాటిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రభుత్వ రంగ సంస్థలు, సాంఘిక భద్రత మరియు దివ్యాంగుల సాధికారత శాఖ మంత్రి అశోక్ చంద్ర పండా మాట్లాడుతూ.. వృద్ధులు సమాజానికి సంరక్షకులుగా అభివర్ణించారు. వృద్ధులకు పలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, మధుబాబు పింఛన్ యోజనలో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 4 లక్షల మంది లబ్ధిదారులను చేర్చిందని తెలిపారు. వృద్ధుల కోసం వివిధ ఆస్పత్రుల్లో వృద్ధాశ్రమాలు, వృద్ధాప్య వార్డులు, ఫిజియోథెరపీ సెంటర్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వృద్ధుల అభ్యున్నతి, మంచి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిషనర్ అను గర్గ్, జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర ప్రియదర్శి, దివ్యాంగుల శాఖ సామాజిక భద్రత, సాధికారత ప్రిన్సిపాల్ సెక్రటరీ సుశీల్ కుమార్ లోహాని తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న వృద్ధులకు సకాలంలో చికిత్స అందించాలని ఎంపీ చంద్రశేఖర సాహు సూచించారు. స్థానిక టౌన్ హాలులో జిల్లా సామాజిక సురక్షా మరియు వికలాంగ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోకపోతే వారి ఆస్తులు కూడా పిల్లలు కోల్పోయే చట్టాలు రావాలని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు అన్నారు. గజపతి జిల్లా వయో వృద్ధుల ఫోరం అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ రోథ్ మాట్లాడుతూ.. మాకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ మాట్లాడుతూ.. వృద్ధులకు సకాలంలో సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పురపాలక సంఘం చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వనమాలి శతపతి, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, డీఆర్‌డీఏ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి గుణనిధి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సరక, వేదికపై పట్నాయక్, టున్ని, రైతా తదితరులు



జయపురం: వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న జెన

వృద్ధులను ఆదర్శంగా తీసుకోవాలి

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, వాటిని అధిగమించి అపార అనుభవం గడించిన వృద్ధులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక అశోక్ కల్యాణ మండపంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వం ఎంతో గౌరవిస్తూ అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక, ఏడీఎం భాస్కర రైతా, ఏడీఎంవో డాక్టర్ లోక్‌నాథ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జయపురం: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ జయపురం కార్యదర్శి సుమన్ జెన వృద్ధాశ్రమాలను ఆదివారం సందర్శించారు. అలాగే బొయిపరిగుడ సమితి ముండాగుడ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు సమాజానికి మార్గనిర్దేశకులన్నారు. వారికి అమితమైన గౌరవమివ్వాలని సూచించారు. వృద్ధులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు జరిపించారు. అనంతరం ఆదివాసీ బాలికల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్‌ను సందర్శించారు.



పర్లాకిమిడి: వయో వృద్ధులకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం



రాయగడ: ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

బరంపురం: స్థానిక ప్రేమనగర్ మెయిన్ రోడ్డులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల పాఠశాలతో పాటు వివిధ పాఠశాలల్లోని చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీల్లో నగరంలోని దాదాపు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

రాయగడ: స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 154 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయుడు జి.పాపారావు, ఎస్.రామారావులు వ్యవహరించారు. కార్యక్రమంలో స్పందన సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరి ప్రసాద్, సాంస్కృతిక విభాగం కార్యదర్శి కొండవలస కృష్ణమూర్తి పట్నాయక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పతివాడ తులసీదాస్‌లు పాల్గొన్నారు.



బరంపురం: చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

27న పరివర్తన సమావేశం



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఈనెల 27వ తేదీన ఖుర్దా గీతా భవన్ గ్రౌండ్‌లో జరగనున్న రాష్ట్ర కాంగ్రెస్ పరివర్తన సమావేశం సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం నవీన్ పట్నాయక్, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సాధారణ ప్రజానీకానికి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఈ పరిస్థితులను రాష్ట్ర కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలియజేశారు. జట్నీ నియోజకవర్గం ఎమ్మెల్యే, ఖుర్దా జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు సురేష్ కుమార్ రౌత్రాయ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఖుర్దా జిల్లా పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు.

టోర్నమెంట్ విజేత టాటాస్టీల్ 11



ట్రోఫీతో టాటాస్టీల్ 11 జట్టు

భువనేశ్వర్: స్థానిక ఒడిశా ఫుట్‌బాల్ అకాడమీ స్టేడియంలో ఫ్రెండ్‌షిప్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్–23 ఆదివారం జరిగింది. ఈ పోటీలో టాటా స్టీల్ 11 జట్టు, ఆఫీసర్స్ 11 జట్టుపై 2–1 స్కోరుతో విజయం సాధించింది. విజేతగా నిలిచిన టాటా స్టీల్ 11 జట్టులో సంగి జముదా, రాజేష్ కుమార్ బార్లా ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో టాటా స్టీల్ 11, లీడర్స్ 11, ఆఫీసర్స్ 11, మీడియా 11 జట్లు పాల్గొన్నాయి. పంచాయతీ రాజ్ మరియు తాగునీటి శాఖ మంత్రి ప్రదీప్ కుమార్ అమత్, ఎలక్ట్రానిక్స్ – సాంకేతిక సమాచారం (ఐటీ) మరియు క్రీడలు – యువజన సేవల శాఖ మంత్రి తుషార్ కాంతి బెహెరా, ఆరోగ్య శాఖ మంత్రి నిరంజన్ పూజారి తదితరులు హాజరయ్యారు.

ఆటో బోల్తా: వ్యక్తి దుర్మరణం

హిరమండలం: ఆటో బోల్తా పడిన ఘటనలో మండలంలోని సుభలయ గ్రామానికి చెందిన యర్రా ఆదినారాయణ (58) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. ఆదినారాయణ చేపల వ్యాపారం చేస్తుంటారు. నిత్యం కాశీనగర్‌లో చేపలు కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చి విక్రయిస్తుంటారు. శనివారం చేపలు కొనుగోలు చేసుకొని ఆటోపై వస్తుండగా అర్ధరాత్రి దాటిన తర్వాత కొండరాగోలు సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆదినారాయణ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఆటో డ్రైవర్ రాంబాబు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించినట్టు చెప్పారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు



రమేష్ రాళో(ఫైల్)

కాశీబుగ్గ, ఇచ్ఛాపురం రూరల్, టెక్కలి: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ జాతీయ రహదారి కోసంగిపురం ఫ్లై ఓవర్ వంతెన వద్ద ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విశాఖపట్నం నుంచి మందస వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ఎదురుగా వస్తున్న ఆటోపై దూసుకుపోవడంతో ఆటోలో ఉన్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరు ఆస్పత్రిలో మృతి చెందారు.



ఆటోలో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు లాగుతున్న స్థానికులు, పోలీసులు



నుజ్జయిన ఆటో ఇదే

ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి ఆటోలో ఏడుగురు వ్యక్తులు పలాస వెళ్తుండగా కోసంగిపురం దగ్గర ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో బత్తుల జయ, బత్తుల ఎర్రయ్య, మడ్డు దేవయ్య, బత్తుల పార్వతి, రమేష్, మాధవరావులతో పాటు వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటకు చెందిన గీత రాంబాబులకు గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి హాహాకారాలు చేస్తున్న క్షతగాత్రులను స్థానికులు పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకుని కొందరు క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఏడుగురిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండగా వారికి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో డొంకూరు మత్స్యకార గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గృహ సారథి, ఆటో డ్రైవర్ రమేష్ రాళో (28) మృతి చెందగా మాధవరావు అనే మరో క్షతగాత్రుడిని టెక్కలి నుంచి శ్రీకాకుళం రిఫర్ చేశారు. ఈ ఘటనపై కాశీబుగ్గ సీఐ జి.శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు


శోకసంద్రంలో రమేష్ కుటుంబం

పలాసలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డొంకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ గృహ సారథి రమేష్ రాళో మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. మృతుడికి భార్య రాలో లెబోజ, కుమారుడు రాలో సూయల్(8 నెలలు) ఉన్నారు. అతను ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

రమేష్ మృతిపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజు, ఎంపీ పీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్ బుడ్డ మోహనాంగి, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి తమ సంతాపాన్ని తెలిపారు.

న్యూస్‌రీల్

మడ్డువలస వద్ద రెండు గేట్ల ఎత్తివేత



ప్రాజెక్టు వద్ద నీటి విడుదల

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద ఆదివారం రెండు గేట్లు ఎత్తివేసి 6500 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో రెండు నదుల నుంచి 6500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి వచ్చి చేరడంతో 64.50 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. దీంతో రెండు గేట్లు ఎత్తి 6500 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్లు ఏఈనితిన్ తెలిపారు.

వైఎస్సార్ పెన్షన్ల పంపిణీలో జిల్లాకు ద్వితీయ స్థానం

- తొలి రోజున 82.02 శాతం పంపిణీ

విజయనగరం అర్బన్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆదివారం తొలి రోజున 82.02 శాతం మందికి పెన్షన్ పంపిణీ చేసి రాష్ట్రంలోనే జిల్లా ఈ స్థానం సాధించింది. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా పంపిణీ జరిగింది. ఉదయం 6 గంటలకే పంపిణీ వ్యవస్థలోని సచివాలయ వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి పెన్షనర్ల వద్దకు వెళ్లి నేరుగా చేతికి అందజేసారు. ప్రధానంగా వృద్ధులకు, అనారోగ్యంతో ఉన్నవారి పింఛన్‌ల పంపిణీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. జిల్లాలోని 14 రకాల పెన్షన్‌లు 2,84,764 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఒక్క రోజులోనే 82.02 శాతంతో 2,33,562 మందికి పంపిణీ జరిగిందని పీడీ తెలిపారు. అత్యధికంగా 90.67 శాతం పంపిణీ చేసి నెల్లిమర్ల అర్బన్ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. 85 శాతం దాటి 89 శాతం వరకు 6 మండలాల్లో పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా మిగిలిన మండలాలన్నీ 74 శాతం దాటి పంపిణీ చేసాయని పీడీ తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని గజపతినగరం జూనియర్ ఇంటర్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ గెస్ట్ ఫ్యాకల్టీ భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీవీఈఓ సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఈసీఈ గ్రూప్‌తో బీఈ/బీటెక్, ఎలక్ట్రానిక్స్‌తో ఏఎంఐఈ 50 శాతం మార్కుల ఉత్తీర్ణత గల విద్యార్హత ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో పాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రం, పదో తరగతి పాస్ సరిఫికెట్‌ల జెరాక్స్ కాపీలతో ఈ నెల 4వ తేదీన స్థానిక జిల్లా వృత్తి విద్యాధికారి కార్యాలయానికి సాయంత్రం 4 గంటలకు హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నెలకు గరిష్టంగా రూ.పది వేలు వేతనం చెల్లిస్తామని తెలిపారు.

4 నుంచి స్పేస్ వారోత్సవాలు

పార్వతీపురం: వరల్డ్ స్పేస్ వారోత్సవాలను అక్టోబర్ 4 నుండి 8వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ స్పేస్ వారోత్సవాలు సందర్భంగా ఇస్రో నిర్వహించే కార్యక్రమాన్ని ఈ ఏడాది ఉత్తరాంధ్రకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ వారోత్సవాలు విశాఖపట్నంలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్నాయని తెలిపారు. వివిధ అంశాలలో పాల్గొనేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారన్నారు. అక్టోబర్ 4న సాయంత్రం 4 గంటలకు ఆర్‌కేబీచ్‌లో జరిగే స్పేస్ వాక్‌కు ఇస్రో చైర్మన్ సోమనాథ్ హాజరవుతారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అక్టోబర్ 2లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పోటీల వివరాలు:

అక్టోబర్ 6న: క్విజ్ (అంశం: స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ).

వ్యాసరచన: (అంశం: నిత్య జీవితంలో ఇస్రో పాత్ర)

అక్టోబర్7న: చిత్రలేఖనం (అంశం: ఇస్రో ఇన్ స్పేస్)

పోస్టర్ తయారీ (అంశం: రోల్ ఆఫ్ ఇస్రో)

పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు రేపు

సీతంపేట: స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయని ప్రిన్సిపాల్ డీఆర్ఎస్ గంగస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ ఎంట్రన్స్ రాసి సీటు రానివారు, సీటువచ్చి కళాశాలలో చేరని వారు పదో తరగతి పాసై, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాయని వారు అర్హులన్నారు. విద్యార్థులు ఒరిజనల్ సరిఫికెట్లతో హాజరు కావాలన్నారు. సీటు పొందిన వారు తక్షణమే ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గ్రూప్-1 విజేతకు ఘనంగా స్వాగతం

నెల్లిమర్ల రూరల్: ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో అలుగోలుకు చెందిన కెల్ల ఉదయ పావని డీఎస్పీగా ఎంపికైంది. హైదరాబాద్‌లో ఉంటున్న పావని గ్రూప్-1 ఉద్యోగం సాధించి తొలిసారిగా శనివారం రాత్రి గ్రామానికి రావడంతో గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. గ్రామస్తులు ఆమెను సత్కరించారు.



వెంకటాపురంలో కట్టింగ్‌కు సిద్ధంగా ఉన్న చెరకుతోట



బూర్జలో ఏపుగా పెరిగి పక్వానికి వచ్చిన చెరకుతోట

చెరకు రైతులారా.. అందోళన అనవసరం..!

- తూనిక కేంద్రాల స్థాయి పెంపు
- నవంబరు మొదటివారంలోగా క్రషింగ్
- ఏర్పాట్లు చేస్తున్న ఈఐడీ ప్యారీస్

సీతానగరం: చెరకు క్రషింగ్ సీజన్ సమీపిస్తుండడంతో చెరకు తరలింపుపై రైతులు ఆందోళన చెందనవసరం లేదని ధైర్యం చెబుతూ సుగర్‌కేన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని ఎన్‌సీఎస్, భీమసింగి చెరకు కర్మాగారాలు 2023-24 సీజన్‌లో గానుగ నిర్వహించకపోవడంతో ప్రభుత్వం సూచనల మేరకు సంకిలి ఈఐడీప్యారీస్ లిమిటెడ్ యాజమాన్యం రైతులనుంచి నేరుగా చెరకు సేకరణకు ఇంతవరకూ ఉన్న తూనిక కేంద్రాల బరువు స్థాయిని పెంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈఐడీ ప్యారీస్ కర్మాగారం పరిధిలో 4లక్షల 8వేలు టన్నుల చెరకు, ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో 1.లక్షల టన్నులపైచిలుకు, భీమ సింగి సహకార చక్కెర కర్మాగారం పరిధిలో 20 వేల టన్నుల చెరకును రైతులు ఉత్పత్తి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు చెరకు తరలింపుపై రైతుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడానికి ఈఐడీ ప్యారీస్ లిమిటెడ్ యాజమాన్యం తూనిక కేంద్రాలను ఏర్పాటుచేసి కర్మాగారానికి చెరకు తరలించాలని సంకల్పించింది. ఇదివరలో ప్రభుత్వం ఆదేశాలతో డిప్యూటీ సుగర్‌కేన్ కమిషనర్, ఈఐడీప్యారీస్ యాజమాన్యం ప్రతినిధులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఇంతవరకూ రైతులతో సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. గతేడాది చెరకు తరలించడంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు 2023-24 క్రషింగ్ సీజన్‌లో పునరావృతం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

బూర్జ వద్ద 20 టన్నుల తూనిక కేంద్రం..

సీతానగరం మండలంలోని బూర్జ, కృష్ణారాయపురం, పెదంకలాం, వెంకటాపురం, లక్ష్మీపురం, నిడగల్లు, సీతానగరం, పణుకుపేట, అనంతరాయుడుపేట, తామరఖండి, కాశీపేట తదితర గ్రామాల్లో రైతులు చెరకు సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే బొబ్బిలి మండలంలోని కారాడ, పారాది, నారాయణప్పవలస, కోమటిపల్లి, తెర్లాం, బాడంగి మండలాల్లో చెరకు సాగవుతోంది. అదే విధంగా ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో రైతులు 1టన్నుకు పైగా చెరకు పండిస్తున్నారు. ఈ మేరకు ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మూతపడినప్పటి నుంచి ప్రభుత్వం తీసుకున్న చొరవ కారణంగా ఈఐడీప్యారీస్ లిమిటెడ్ చక్కెర కర్మాగార యాజమాన్యం ఇక్కడి నుంచి చెరకు సేకరిస్తోంది. ఈ నేపథ్యంలోనే రైతుల నుంచి చెరకు సేకరిస్తామని అగ్రిమెంట్ చేసింది. గతంలో ఉన్న చెరకు తూనిక కేంద్రాలతో పాటు సీతానగరం మండలంలోని బూర్జలో 20 టన్నుల తూనిక యంత్రం, ఏగోటివలస, బొబ్బిలి మండలం బొడ్డవలస, రంగరాయపురం ప్రాంతాల్లో అదనంగా తూనిక కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఈఐడీప్యారీస్ యాజమాన్యం నిర్ణయించింది.



20 మెట్రిక్‌టన్నుల బరువు తూచేందుకు ఏర్పాటుచే చేసిన తూనికయంత్రం

వేగవంతంగా చెరకు తరలించడానికి చర్యలు..

ఈఐడీప్యారీస్ ఇండియాలిమిటెడ్ యాజమాన్యం ఈనెలాఖరులేదా నవంబరు మొదటి వారంలోగా క్రషింగ్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంది. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో రైతులు పండించిన చెరకుకు సకాలంలో కట్టింగ్ ఆర్డర్లు ఇచ్చి, కర్మాగారానికి చేరవేయడానికి అనుకూలంగా లారీలను ఏర్పాటు చేస్తాం. చెరకు సాగు విస్తీర్ణం, రవాణా సౌకర్యాల ఆధారంగా తూనిక కేంద్రాల ఏర్పాటు చేపడుతున్నాం. సీతానగరం మండలం బూర్జలో ఇప్పటివరకూ 10 టన్ను చెరకు తూకానికి సరిపడిన తూనిక యంత్రానికి బదులుగా 2023-24 క్రషింగ్ సీజన్‌లో 20 టన్నుల బరువు చెరకును తూకం వేస్తాం. లక్ష్మీపురంలో కొత్తగా చెరకు తూనిక యంత్రాన్ని నెలకొల్పుతున్నాం. ఏగోటివలస, బొబ్బిలి మండలం పక్కి రంగరాయపురం, మక్కువ మండలం వెలగవలస ప్రాంతాల్లో తూనిక కేంద్రాలు ఉన్నాయి.

– మురళి, ఏజీఎం, ఈఐడీప్యారీస్‌లిమిటెడ్

రెండు కర్మాగారాల పరిధిలోని చెరకు క్రషింగ్



జిల్లాలో భీమసింగి, ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాల పరిధిలో రైతులు ఉత్పత్తి చేసిన చెరకును ప్రభుత్వ సూచనలమేరకు పూర్తిస్థాయిలో ఈఐడీ ప్యారీస్ యాజమాన్యం తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేసింది. రైతులు చెరకు తరలింపుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెండు ప్రాంతాల రైతులనుంచి చెరకు సేకరిస్తారు. ఇప్పటికే గ్రామాల్లో చెరకు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశాం.

– జీవీవీ సత్యనారాయణ, సుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్, బొబ్బిలి

వేడుకగా బీఎస్ఎన్ఎల్ 24వ ఆవిర్భావ దినోత్సవం



4జి సిమ్‌కార్డులు, ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

విజయనగరం టౌన్: భారతీయ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆఫ్ ఇండియా 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యాలయం ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా చిన్నారులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు 4జి సిమ్‌కార్డు వ్యాలిడిటీతో అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రంతో పాటూ75 మంది విద్యార్థులకు 4జి సిమ్ కార్డులు అందజేశారు. బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి సంస్థ ఉద్యోగులందరూ సహకరించాలని, వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆలుగు వెంకటరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, మురళీధర్, జగదీష్‌లతో పాటు ఎస్ఎఫ్‌టీఈ కార్యదర్శి అప్పారావు, బీటీఈయూ కార్యదర్శి మాలికో, సభ్యులు శకుంతల, సుజాత, సంగీత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మక్కువలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మావుడి రంగునాయుడు, ఆటోడ్రైవర్లు

మక్కువ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహనమిత్ర పథకం ఆటోడ్రైవర్లకు వరంలాంటిదని వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రధానరహదారి వద్ద ఆదివారం ఆటోయూనియన్ల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఏదోవిధంగా మేలు చేయాలన్న సంకల్పంతో, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆటోడ్రైవర్లను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. పేదవాడి కోసం పరితపిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

గాజు సీసాలో 'గాంధీ'

కొత్తవలస: మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న జి.పరమేశ్వరరావు గాజు సీసాలో మహాత్మాగాంధీ చిత్రాన్ని గీసి అబ్బురపరిచారు. అక్టోబర్2న గాంధీ జయంతి సందర్భంగా ఈ బొమ్మ గీసినట్లు ఆయన తెలిపారు. దీంతో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పరమేశ్వరరావును అభినందించారు.



గాజుసీసా లోపలి భాగంలో గీసిన మహాత్మాగాంధీ చిత్రం



డ్రాయింగ్ టీచర్ పరమేశ్వరరావు

రాజన్నదొరకు ధన్యవాదాలు

సాలూరు: అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సహాయసహకారాలు అందించిన ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరకు కొలంబోలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన కనకల పైడిరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. అంతర్జాతీయ పోటిల్లో రాణించిన ఆమెను ఆమె కన్నవారి ఊరైన సాలూరు మండలంలోని మామిడిపల్లి గ్రామంలో నాయకులు, ప్రజలు ఆదివారం సన్మానించారు. జీవితంలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధ్యాయుల శిక్షణ, తల్లిదండ్రులు, పెళ్లయిన తరువాత భర్త, అత్తమామలు, తాను ఉద్యోగం చేస్తున్న యాజమాన్యం సహాయ సమకారాలతోనే అంతర్జాతీయస్థాయి వరకు వెళ్లగలిగానని సంతోషం వెలిబుచ్చింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలు జర్జాపు ఈశ్వరరావు, నీలిమ, సువ్వాడ గుణవతి, రామకృష్ణ, తౌడు, చినబాబు, సుధాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

పాలకొండ రూరల్/వీరఘట్టం: వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వ్యక్తిపై పిడుగు పడడంతో మృత్యువాతపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండలం తెట్టంగి గ్రామానికి చెందిన మొదిలి సింహాచలం(37) పాలకొండ మండలం నవగాం గ్రామానికి వచ్చాడు. వర్షం పడుతుండడంతో గ్రామానికి సమీపంలో ఉన్న వైన్ షాపు దగ్గర చెట్టు మొదట్లో నిలబడ్డాడు. ఈ క్రమంలో వర్షంతో పిడుగు పడడంతో సింహాచలం కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. అదేసమయంలో సమీపంలో ఉన్న వారణాసి సంతోష్, బండి బంగారుబాబు, బోనెల శ్రీనివాసరావులు పిడుగు ధాటికి పగిలిన గాజు సీసా ముక్కలు గుచ్చుకుని గాయాలపాలయ్యారు. క్షతగాత్రులు నవగాం గ్రామానికి చెందినవారు. ఈ ప్రమాదంపై స్థానికులు 108కి సమాచారం అందించగా పైలెట్ లావేటి చంద్రం, ఈఎంటీ ఎ.శ్రీనివాసరావులు క్షతగ్రాతులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే సింహచలం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.



ఘటనా స్థలంలో అపస్మారక స్థితిలో సింహాచలం

ఆగిఉన్న లారీని ఢీకొని వ్యక్తి..

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి సాలూరు మండలం కుద్దాడ గ్రామానికి చెందిన ఉయ్యాల రాము, మరో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సాలూరు నుంచి పి.కోనవలస వస్తుండగా గంగన్నదొర వలస సమీపంలో ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారులు ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఉయ్యాల రాము మృతిచెందాడు, దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దూరం



కొండకొత్తవలసలో ర్యాలీలో పాల్గొన్న వీసీ కట్టిమణి

దత్తిరాజేరు: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దూరమవుతాయని ట్రైబల్ యూనివర్సిటీ వీసీ కట్టిమణి అన్నారు. ఈ మేరకు మండలంలోని మర్రివలస వద్ద యూనివర్సిటీ నిర్మాణ సరిహద్దు గ్రామమైన కొండకొత్తవలసలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామపెద్దలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి కలుపు మొక్కలు తీసి వీధులలో చెత్తాచెదారాలు లేకుండా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దల వరకు ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలలో చెత్తా,చెదారాలు లేకుండా చేస్తే దోమలు, ఈగలు చేరకుండా ఉండడంతో ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి

- విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎ.డి జగదీష్
- ఘనంగా వృద్ధుల దినోత్సవం



మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎ.డి జగదీష్

విజయనగరం అర్బన్: వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జగదీష్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలిత ఏడీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లాలో మూడు చోట్ల ఏర్పాటు చేసామని తెలిపారు. వృద్ధులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామన్నారు. వీటి ద్వారా బస్సు చార్జీల్లో 20 శాతం రాయితీ పొందవచ్చునని చెప్పారు. ఆస్పత్రిలో పది శాతం పడకలను వృద్ధులకు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడమే కాకుండా బ్యాంకుల్లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద కూడా వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని చెప్పారు. ఆర్డీవోల ద్వారా సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌ను అమలు చేసి, వృద్ధుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి పీఎస్‌వీ లక్ష్మీనారాయణ, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.కుప్పూరావు, సంఘం ప్రతినిధులు పెద్దింటి అప్పారావు, చదలవాడ ప్రసాద్, పలువురు సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరం క్రైమ్: స్థానిక బాలాజీనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న పొదల్లో సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

సర్వజన ఆస్పత్రిలోనే.. అన్ని వైద్య పరీక్షలు

- 100 రకాల వైద్య పరీక్షలు
- రోజుకు 2 వేల నుంచి 2500 వరకు పరీక్షలు

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజారోగ్యమే ప్రథమమని గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుకు తగిన ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులను నాడు – నేడు ద్వారా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించింది. దీంతో రోగులకు వైద్య సేవలన్నీ సకాలంలో అందుతున్నాయి.



రోగులకు వైద్య పరీక్షలు చేసేందుకు రిజిస్ట్రేషన్ చేస్తున్న ల్యాబొరేటరీ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్:

ప్రజారోగ్యానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రజలకు అవసరమైన వైద్య సేవలన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అందేవిధంగా చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడం వల్ల జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. దీంతో వైద్య సేవలు, సిబ్బంది అన్ని రెట్టింపు స్థాయిలో పెరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు కల్పించడం వల్ల రోగులు అధిక సంఖ్యలో వైద్య సేవలు పొందుతున్నారు. ముఖ్యంగా జబ్బు చేస్తే వ్యాధి నిర్ధారణ ముఖ్యం. వచ్చిన వ్యాధి ఏంటనేది తెలిస్తే దానికి సంబంధించిన చికిత్స అందించడానికి వీలుంటుంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోనే అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే విధంగా చర్యలు చేపట్టింది. వైద్య పరీక్షలన్నీ సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో ఉండడంతో రోగులు రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

100 రకాల వైద్య పరీక్షలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నిత్యం అధిక సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తారు. ఓపీ సేవల కోసం రోజుకు 1200 నుంచి 1500 మంది వరకు వస్తారు. వీరిలో 200 నుంచి 250 మంది వరకు వైద్య పరీక్షల కోసం ల్యాబొరేటరీకి వస్తారు. వీరికి 2 వేల నుంచి 2500 వరకు పరీక్షలు చేస్తున్నారు. ఆస్పత్రిలో 100 రకాల పరీక్షలు చేస్తున్నారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్, హెచ్‌బీ, పాలిమ్రోఫ్స్, లింఫోసైటీస్, మోనోసైటీస్, బసోపిల్స్, టీఆర్‌బీసీ, పీసీవీ, ఎంసీవీ, ఎంసీహెచ్, ఎంసీహెచ్‌సీ, ప్లేట్‌లెట్ కౌంట్, ఈఎస్ఆర్, బ్లీడింగ్ టైమ్, క్లాటింగ్ టైమ్, బ్లడ్ గ్రూప్, స్మీర్ ఫర్ ఎంపీ, యూరిన్ హెచ్‌సీజీ, యురిన్ షుగర్, ఆర్‌బీసీ, క్రిష్టయల్స్, గ్లూకోజ్ పాస్టింగ్, యూరియా క్రియేటిన్, యూరిక్ యాసిడ్, హెచ్‌డీఎల్, ఎల్‌డీఎల్, వీఎల్‌డీఎల్ , బైలురుబిన్, ఏఎస్‌టీ, ఆలుబిన్, డి డైమర్, ఫెర్రిటిన్, ఎఫ్ఏ ఫ్యాక్టర్, హెచ్‌సీవీ, ఎస్.సీఆర్‌పీ, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ వంటి 100 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు.

థైరాయిడ్, ఎఫ్ఎస్‌సీ, కల్చర్ పరీక్షలు కూడా..

గతంలో థైరాయిడ్, ఎఫ్ఎన్‌సీ, బ్లడ్ కల్చర్, యూరిన్ కల్చర్ పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇందుకోసం రోగులు సొంత డబ్బులు వెచ్చించేవారు. ప్రస్తుతం ఈ పరీక్షలు కూడా సర్వజన ఆస్పత్రిలో చేస్తున్నారు. బ్లడ్ కల్చర్, యూరిన్ కల్చర్ కోసం ఆస్పత్రిలో బయో కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసారు.

జ్వరాల విజృంభణ

జిల్లాలో ప్రస్తుతం జ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెతో పాటు పట్టణాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారు. నిత్యం జ్వర పీడితులు ఆస్పత్రులకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి పరీక్షలు చేస్తున్నారు. అన్ని పరీక్షలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా అందించడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది.



రోగికి రక్త నమూనా తీస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



శాంపిల్స్‌ను పరీక్షిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

సేవలు బాగున్నాయి..



థైరాయిడ్ లక్షణాలు ఉన్నాయని సర్వజన ఆస్పత్రికి వచ్చాను. అక్కడ వైద్యులు నన్ను పరీక్షించి థైరాయిడ్ పరీక్ష చేసుకోవాలని చెప్పారు. డాక్టర్ రాసిన చీటి పట్టుకుని వెళ్తే ల్యాబ్ దగ్గర నాకు థైరాయిడ్ పరీక్ష చేసారు. అక్కడికక్కడే సేవలు అందాయి.

– కదంబ సత్యవతి, వైఎస్సార్ నగర్

అన్ని పరీక్షలు ఉచితంగానే...



జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి ఉన్నాయని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చాను. డాక్టర్ నన్ను పరీక్షించి మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేసుకోవాలని చీటిరాసి ఇచ్చారు. చీటీ పట్టుకొని ల్యాబొరేటరీ దగ్గరకు వెళితే అన్ని పరీక్షలు ఉచితంగా చేసి రిపోర్టు ఇచ్చారు.

– పైడిరాజు, పెంట శ్రీరాంపురం, గంట్యాడ మండలం

100 రకాల వైద్య పరీక్షలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే వారికి 100 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన ఆధునాతన పరికరాలను ప్రభుత్వం అందించింది. వైద్య సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో నియమించారు.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి